# స్వయంకృతం



"ఎలా ఉంది అమ్మాయి?"

–స్నేహితుడు సతీష్‌ని అడిగాడు సాగర్.

"చాలా బాగుంది. నేను ఎటువంటి అమ్మాయి కోసం యిన్నాళ్లూ ఎదురుచూశానో అలాగే ఉంది" సంతోషంగా అన్నాడు సతీష్.

"కంగ్రాట్స్ రా!" అన్నాడు సాగర్. అతనికి తెలుసు... సతీష్ తన కాబోయే జీవిత భాగస్వామిని గురించి ఎన్ని కలలు కంటున్నాడో! అందమైన అమ్మాయి తన భార్యగా రావాలని, ఆమెను తను కళ్ళల్లో పెట్టుకొని చూసుకోవాలని, తమది ఆదర్శ దాంపత్యం

కావాలని అతని ఆశ! తల్లిదండ్రులు లేని సతీష్‌కి అతని అన్నయ్య ఒక్కడే దగ్గరి బంధువు. తండ్రి మిగిల్చిన పూర్వీకుల నుంచి సంక్రమించిన యింటిని రెండు భాగాలు చేసుకుని చెరో యిల్లు తీసుకున్నారు. సతీష్ తన వాటా బాడుగకు యిచ్చి అన్నావదినలతోనే ఉంటున్నాడు.

సతీష్‌కి పెళ్ళి కుదిరిందని తెలియగానే అతన్ని అభినందించడానికి వచ్చాడు సాగర్. సతీష్ కట్నం లేకుండా పెళ్ళికి ఒప్పుకోవడం అతన్ని మరింత ఆనందపరిచింది.

"అమ్మాయి ఫోటో తెచ్చావా?"

"తెచ్చాను..." అంటూ నవ్వి, పర్సు తీసి అందులోని ఫోటోని చూపాడు సతీష్.

"బాగుంది. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా ఉంటారు యిద్దరూ!" అన్నాడు సాగర్.

ఆ తర్వాత కొద్దిరోజులకు విజయ, సతీష్‌ల పెళ్ళి జరిగింది. ఉన్నంతలో బాగానే పెళ్ళి జరిపించాడు విజయ తండ్రి.

సతీష్ కోరుకున్నట్లే అతని అభిరుచులకు తగ్గట్టుగా ప్రవర్తించసాగింది విజయ.

సతీష్‌కి ప్రపంచాన్నే జయించినంత సంతోషంగా ఉంది. నెలరోజులు ఆఫీసు, ఇల్లు తప్ప మరోప్రపంచం లేనట్లు ప్రవర్తించాడు.

●

"అమ్మా..." – విజయ అరవడం విని వంటగది వైపు పరిగెత్తాడు సతీష్.

విజయ తన ఎడమ చేతివైపు చూసుకుంటోంది.

ఆమె ముఖంలో బాధ కనబడుతోంది.

"ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు.

"వేడి నూనె చేతిపై పడింది."

"అరెరె... ఎలా? బొబ్బలెక్కాయేమో చూడు! పద... బర్నాల్ రాస్తాను."

"ఉండండి... యింకా కాస్త పిండి మిగిలివుంది. చేగోడీల పని పూర్తిచేసి వస్తాను."

"ఆ పని తర్వాత చూసుకుందువుగాని పద!" అంటూ స్టౌ ఆర్పి, ఆమె చేయి పట్టుకుని హాల్లోకి తీసుకుపోయాడు.

కాలిన చోట బర్నాల్ రాసి, "సాయంత్రం డాక్టర్ దగ్గరికెళ్దాం. ఓ టీటీ యింజక్షన్ వేయించుకుంటే మంచిది!" అన్నాడు.

"మీరు మరీ కంగారుపడి గోరంతని కొండంతలు చేస్తున్నారు."

"అవును. నీమీద కొండంత ప్రేమ ఉంది కాబట్టి నీకు గోరంత దెబ్బ తగిలినా తట్టుకోలేను."

ఆమె అతని వైపు ఓ క్షణం చూసి తర్వాత తల దించుకుంది.

"ఏమిటి మాట్లాడవు?"

"నొప్పి!" అంటూ కాలినచోట చూపించింది.

"కొద్దిసేపటికి తగ్గిపోతుందిలే! కాసేపు టీవీ చూడు. మైండ్ డైవర్ట్ అవుతుంది..." అంటూ టీవీ ఆన్ చేశాడు సతీష్.

●

ఉదయం ఆరు గంటలకు నిద్ర నుంచి మేలుకున్న సతీష్ కళ్ళు తెరిచి చూశాడు.

విజయ అప్పుడే స్నానం చేసివచ్చి అటు తిరిగి దుస్తులు ధరిస్తోంది. ఆమె వీపు మీద అక్కడక్కడా కమిలినట్లుగా నల్లని మచ్చలు కనిపించాయి అతనికి.

"విజయా... ఏమిటి నీ వీపంతా మచ్చలు?" ఆదుర్దాగా అడిగాడు.

విజయ వెనక్కి తిరిగి అతన్ని చూసి, కంగారుగా చీరను వీపుపై కప్పుకుంటూ "దొంగా! మిమ్మల్నెవరు చూడమన్నారు? ఆడవాళ్ళు దుస్తులు మార్చుకుంటూంటే మగవాళ్ళు అలా చూడకూడదు" అంది.

"మొగుడు చూడవచ్చు!" అని, "నేను సీరియస్‌గా అడుగుతున్నాను... ఏమైంది?" అని అడిగాడు.

"స్కిన్ అలర్జీ! పది రోజులుగా యిబ్బంది పడుతున్నాను..."

"మరి, నాకెందుకు చెప్పలేదు?"

"చెప్పాలంటే సిగ్గేసింది. పైగా, ఎన్నని చెప్పమంటారు? ఇప్పటికే మీరు నాకోసం చాలా ఖర్చు చేస్తున్నారు" బాధగా అంది.

"ఇలాంటివి దాచుకోకూడదు విజయా! సాయంత్రం స్కిన్ స్పెషలిస్ట్ దగ్గరికి తీసుకెళతాను."

"అలాగే..." అంది విజయ.

•

సాయంత్రం ఆఫీసు నుండి యింటికి వచ్చిన సతీష్‌కి యింట్లో విజయ కనిపించలేదు.

పెరట్లో ఉన్న అతని వదినని అడిగాడు.

"విజయ బయటకు వెళ్ళింది. నీవు రాగానే చెప్పమంది."

"ఎక్కడికి కెళుతోందో చెప్పలేదా?"

"లేదు..."

'ఎక్కడికి వెళ్ళి ఉంటుందబ్బా?!' అనుకుంటూ హాల్లోకి వచ్చి కుర్చీలో కూర్చుని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

కొంతసేపటికి ఫోన్ మ్రోగింది.

రిసీవర్ తీసి, "హలో..." అన్నాడు.

"ఈజ్ ఇట్ సతీష్?"

"అవునండీ... మీరు?"

"నేను పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని! మీరు వెంటనే వన్ టవున్ పోలీస్‌స్టేషన్‌కి రండి!"

"ఎందుకు?"

"మీ భార్యను చూడ్డానికి!"

"ఆమె అక్కడ ఎందుకుంది?"

"ఆ విషయం మీరు ఇక్కడికి వస్తే తెలుస్తుంది."

"ఇప్పుడే బయలుదేరుతున్నాను..." అని ఫోన్ పెట్టబోతూ... మళ్లీ "హలో..." అన్నాడు.

"చెప్పండి..."

"ఆమెకేం కాలేదు కదా!" అతని కంఠంలో ఆందోళన.

"మా దగ్గరికొచ్చాక ఏం కాలేదు... మీరు రండి!"

అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు వినిపించింది.

సతీష్ అతని వదినతో తను బయటకు వెళుతున్నానని చెప్పి స్కూటర్‌పై బయలుదేరాడు.

పది నిమిషాల్లో పోలీస్‌స్టేషన్ చేరుకున్నాడు. అక్కడ విజయ క్షేమంగా ఉండటం చూసి అతని మనసు శాంతించింది.

"విజయా..." అంటూ ఆమెని సమీపించబోయాడు. ఆమె మొహం తిప్పుకుంది.

"కూర్చోండి మిస్టర్ సతీష్! మీరు మీ భార్యను కట్నం కోసం చిత్రహింసలు పెడుతున్నట్లు ఆవిడ కంప్లైంట్ యిచ్చారు. సెక్షన్ 498 (ఎ) ప్రకారం యిది సీరియస్ అఫెన్స్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను చిత్రహింసలు పెట్టానా? అబద్ధం! నేను ఆమెను నా ప్రాణం కన్నా మిన్నగా ప్రేమిస్తున్నాను."

"అని మీరంటే సరిపోదు. ఆ మాట ఆవిడ అనాలి. తన కంప్లైంట్ వాపసు తీసుకోవాలి."

"విజయా... ఏమిటిది? నీకేమైనా పిచ్చి పట్టిందా?"

"ఇన్నాళ్లూ పిచ్చిదాన్లా మీరు పెట్టిన హింసలన్నీ భరించాను. ఇక నావల్ల కాదు" రెండు చేతులూ జోడించింది విజయ.

"నేను నిన్ను ఎప్పుడు హింసించాను విజయా?"

"మీరు వేడినూనె నా చేతిపై పొయ్యలేదా? సిగరెట్‌తో నా వీపంతా కాల్చలేదా? జుట్టు పట్టుకుని కొట్టలేదా? మీ కాళ్లతో నన్ను తన్నలేదా? ఆనాడు గొప్ప కోసం కట్నం లేకుండా పెళ్ళి చేసుకొని యిప్పుడు నన్ను చిత్రహింసలు పెడతారా?"

"విజయా! నువ్వు అర్థంలేకుండా మాట్లాడుతున్నావు. పద... యింటికెళదాం!" విసుగ్గా అన్నాడు సతీష్.

"నేను రాను. మీమీద కంప్లైంట్ యిచ్చానన్న కోపంతో యిన్నాళ్ల నరకాన్ని యీ ఒక్కరోజే చూపిస్తారు నాకు."

సతీష్ తల పట్టుకున్నాడు.

"చూడండి సతీష్! మా లేడీ కానిస్టేబుల్స్ ఆవిడని పరీక్ష చేసి ఆమె కంప్లైంట్‌లో రాసినదంతా నిజమేనని చెప్పారు. మీరూ మీ తప్పు ఒప్పుకుంటే మంచిది. మీ అన్నావదినలు యింట్లో ఉన్నారా?" అన్నాడు ఎస్.ఐ.

"మా వదిన యింట్లోనే ఉన్నారు" అతనేదో సలహా యివ్వబోతున్నాడని ఆశగా ఎస్.ఐ. వైపు చూశాడు సతీష్.

"మీ అన్నావదినల మీద కూడా మీ ఆవిడ కంప్లైంట్ చేశారు."

"మా అన్నావదినల మీదా?" ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. "వాళ్ళు అమాయకులు. చీమకు కూడా హాని చేయనివారు!" అన్నాడు.

"మీ యింట్లోని వ్యక్తుల గురించి నాకెలా తెలుస్తుంది? ఆవిడ కంప్లైంట్‌లో ఏం రాశారో అదే చెప్పాను."

"అయితే... ఇప్పుడు నన్నేం చేయమంటారు?"

"మీరేం చెయ్యనక్కరలేదు. మేమే చెయ్యాలి... అ..రె..స్ట్!"

"అ..రె..స్టా..?" అతని ముఖంలో భయం, బాధ రెండూ కనిపించాయి.

"అవును. మిమ్మల్ని కస్టడీలోకి తీసుకుంటాము. తర్వాత కోర్టులో ప్రవేశపెడతాము. ఆపైన ఛార్జిషీట్ ఫైల్ చేస్తాము. మెజిస్ట్రేట్ ముందు మిమ్మల్ని ప్రొడ్యూస్ చేసిన తరువాత మీరు బెయిలుకు అప్లై చేసుకోవచ్చు."

సతీష్‌కి జరుగుతున్నది కలో, నిజమో అర్థంకావడం లేదు. 'తను అంత అపురూపంగా చూసుకున్న భార్య తన మీద కంప్లైంట్ యివ్వడమేమిటి? తనను అరెస్ట్ చేయించడమేమిటి? టీవీలో, సినిమాలో చూసినది తన జీవితంలో జరగడమేమిటి?' అనుకున్నాడు.

"చెప్పండి..."

"అరెస్ట్ చేయండి!" కళ్ళనీళ్లతో అన్నాడు.

"మిమ్మల్నొక్కర్నే కాదు, మీ అన్నావదినల్ని కూడా అరెస్ట్ చెయ్యాలి."

"వద్దండీ! మా అన్నయ్య అరెస్ట్ అయ్యాడంటే అతని ఉద్యోగం పోతుంది. ఎన్నో ఏళ్లు టెంపరరీగా చేస్తే ఈమధ్యనే పర్మనెంట్ అయింది. అతన్ని యిందులోకి లాగకండి. అతనికి పడే శిక్ష కూడా నాకే వెయ్యండి."

"మీ అన్నయ్య అరెస్ట్ కాకూడదనుకుంటే అందుకు ఒకటే మార్గం!"

ఏమిటన్నట్లు చూశాడు సతీష్.

"మీ ఆవిడ తన కంప్లైంట్ వాపసు తీసుకోవాలి."

అతను విజయ వైపు తిరిగి, "విజయా! నీకు చేతులెత్తి వేడుకుంటున్నాను. మా అన్నయ్య ఎంత అమాయకుడో నీకు తెలుసు. అతను యిలాంటివి తట్టుకోలేడు. ప్లీజ్... కంప్లైంట్ విత్‌డ్రా చేసుకో!" అన్నాడు రెండు చేతులూ జోడించి అభ్యర్థిస్తూ.

"విత్‌డ్రా చేసుకుంటాను. కాని, ఒక్క కండిషన్ మీద!" అంది విజయ.

"ఏమిటది?"

విజయ చెప్పింది.

●

తన ఇంట్లోకి అడుగుపెట్టిన సాగర్‌ని చూసి ఆత్రుతగా ఎదురొచ్చాడు సతీష్.

"విజయతో మాట్లాడావా?" అని అడిగాడు.

మాట్లాడానన్నట్లు తలూపాడు సాగర్.

"ఏమంది?"

"నువ్వు ధైర్యంగా ఉంటానంటే చెబుతాను."

నీరసంగా నవ్వాడు సతీష్. "ఇంత జరిగినా యింకా బ్రతికే ఉన్నానంటే నేను ధైర్యస్థుడి క్రిందే లెక్క! ఏమిటో చెప్పు!" అన్నాడు.

"విజయ త్వరలో నీకు విడాకుల నోటీసు పంపిస్తానంది."

మాటలు రానివాడిలా అచేతనంగా నిలబడిపోయాడు సతీష్.

"బాధపడకు సతీష్! నీలాంటి మంచి భర్తను యింతగా క్షోభ పెడుతున్న ఆమె తను చేసిన పాపానికి ఫలితం అనుభవిస్తుంది!" అన్నాడు సాగర్.

"వద్దురా... అలా మాట్లాడకు! ఆమె నన్నెంత బాధపెట్టినా నేను మాత్రం ఆమెను యింకా ప్రేమిస్తూనే ఉన్నాను."

"నువ్వు ఆమెను ఎంతో ప్రేమించావు. ఈనాటికీ ప్రేమిస్తున్నావు. కాని, ఆమె నిన్నేనాడూ ప్రేమించలేదు."

"అబద్ధం!"

"కాదు... నిజం! నీకు చెప్పకూడదనుకున్నాను కాని, చెప్పకుండా ఉండలేక పోతున్నానురా! విజయ పెళ్ళికి ముందు వేరొకతన్ని ప్రేమించింది. ఈరోజు వరకూ అతన్నే ప్రేమిస్తోంది. నీతో ప్రేమ నటించింది... అంతే!"

నమ్మలేనట్లు చూశాడు సతీష్.

"అవున్రా! అతనికి ఉద్యోగం లేదు. అతనితో పెళ్ళికి ఆమె తల్లిదండ్రులు అంగీకరించలేదు. నీతో పెళ్ళికి ఆమె ఒప్పుకోలేదు. ఒప్పుకోకపోతే ఉరి వేసుకుని ఛస్తామని తల్లిదండ్రులు బెదిరించారు. తప్పనిసరై నీతో పెళ్ళికి ఒప్పుకుంది.

ఇంతలో... ఆమెకు వచ్చిందో, ఆమె ప్రియుడికి వచ్చిందో... ఓ ఆలోచన వారిలో రూపుదిద్దుకుంది. కట్నం కోసం వేధింపబడే వాళ్ళ కోసం ప్రవేశపెట్టిన ఓ సెక్షను వాడుకుని, నీ నుంచి డబ్బు గుంజాలని అనుకున్నారు. నీ పేరు మీద యిల్లు ఉందన్న విషయం పెళ్ళికి ముందే వాళ్ళకు తెలుసు. అందుకే తమ ప్లాను పర్‌ఫెక్ట్‌గా అమలుచేశారు. నీవు తొందరపడి డబ్బులు ఇచ్చేశావు."

"ఏం చెయ్యమంటావు? సమయానికి నువ్వు ఊర్లో లేవు. ఎవరి సహాయమన్నా తీసుకుందామన్నా- కట్టుకున్న భార్య గురించి చెప్పుకోవడానికి సిగ్గేసింది. పైగా, అన్నయ్య ఉద్యోగానికి ఎక్కడ ముప్పు వస్తుందో... అన్న భయం ఒకవైపు. అందుకే ఎక్కడబడితే అక్కడ అప్పులు చేసి రెండు లక్షలు ఆమెకిచ్చాను. అయితే, డబ్బులు పోయినందుకు నేను బాధపడటం లేదురా! ఆమె చేసిన మోసమే నా గుండెను కోసేస్తోంది!" అన్నాడు సతీష్ కళ్ళనీళ్లతో.

"నాగరికత వెఱ్ఱితలలు వేస్తున్న యీ సమాజంలో తరిగిపోతున్న నైతిక విలువలకు, తెగిపోతున్న మానవ సంబంధాలకు నీ కథ ఓ ఉదాహరణ! సదుద్దేశంతో ప్రభుత్వం ఓ చట్టాన్ని తెస్తే తమ స్వార్థానికి, మోసానికి విజయ లాంటి వాళ్ళు ఆ చట్టాన్ని వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారు. అంతేకాదు, నీలాంటి అమాయకుల జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారు. అయితే అన్యాయానికి తాత్కాలికంగా విజయం లభించినా అంతిమ విజయం మాత్రం న్యాయానిదే! నువ్వు ధైర్యంగా ఉండు. నాకు తెలిసిన మంచి లాయర్ ఒకరున్నారు. ఆయనకు నీ కేసు అప్పగిస్తాను" అన్నాడు సాగర్.

"ఇక ఏ లాయరూ వద్దు. నేనంటే యిష్టంలేని వ్యక్తితో కాపురం చేయడం నాకిష్టం లేదు. ఆమె కోరినట్టే విడాకులు యిస్తాను. కనీసం ఆమైనా సుఖంగా ఉండనీ!" ఆఖరి మాటలంటూంటే సతీష్‌కు ఏడుపొచ్చింది. మిత్రుడి భుజంపై తలపెట్టి ఏడవసాగాడు.

●

మనసుకు మనిషి వల్ల తగిలిన గాయాన్ని కాలం మాన్పుతుంది.

సతీష్ రెండేళ్ల తర్వాత సాగర్ ప్రోద్బలంతో శ్రావణిని పెళ్ళిచేసుకున్నాడు. ఆమె గొప్ప సంగీత విద్వాంసురాలు. సతీష్ గళం చక్కగా ఉండటం గమనించి అతనికి సంగీతం నేర్పించింది శ్రావణి.

క్రమంగా ఇద్దరూ కలసి రాష్ట్రమంతటా కచ్చేరీలు చేస్తూ అనతి కాలంలోనే ఎంతో పేరుప్రఖ్యాతులు సంపాదించారు.

పదేళ్ల తర్వాత కాకినాడలో జరిగిన వారి కచ్చేరీకి హాజరయ్యింది విజయ. స్టేజి పైన సతీష్‌ని చూసి నివ్వెరబోయింది. తర్వాత అతని పాటలు వింటూ తన్మయత్వంలో మునిగిపోయింది. కచ్చేరీ పూర్తయ్యాక శ్రోతలు సతీష్‌ని చుట్టుముట్టారు. విజయ- బ్యాగ్ సర్దుకుంటున్న శ్రావణి దగ్గరికి వెళ్లి పలకరించింది.

"మీరు సతీష్‌గారి భార్యా?"

"అవునండీ... నా పేరు శ్రావణి!"

"తెలుసు. నేను సతీష్‌గారితో మాట్లాడాలి!"

"వెళ్లి మాట్లాడండి!" అంది శ్రావణి.

విజయ యిబ్బందిగా చూసి, "ఇక్కడ కాదు, ఏకాంతంగా మాట్లాడాలి!"

"విషయం ఏమిటి?"

"నేను ఆయన మొదటి భార్యను!"

శ్రావణి ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ "విజయ అంటే మీరేనా?" అని అడిగింది.

అవునన్నట్లు తలూపింది విజయ.

"మీరు మళ్లీ పెళ్ళిచేసుకున్నారని విన్నాను. మీవారు రాలేదా?"

"మేం పెళ్ళి చేసుకోలేదు. అతను డబ్బులు తీసుకుని పారిపోయాడు. అమ్మానాన్నలు యింటినుంచి గెంటేశారు. మళ్లీ ఆయన దగ్గరకే వెళ్దామనుకున్నాను. అటువంటి ఉత్తముడి పాదాలు తాకే అర్హత కూడా నాకు లేదనిపించి ఆ ఆలోచన మానుకున్నాను. నేను చేసిన పనికి పశ్చాత్తాపం చెందని రోజు లేదు. దేవుడిలాంటి భర్తను అవివేకంతో దూరం చేసుకున్నాను" అంటూ కళ్ళనీళ్లు పెట్టుకుంది విజయ.

"ఊరుకోండి. జరిగిపోయిన వాటి గురించి యిప్పుడు బాధపడి లాభం లేదు."

"నేను ఒక్కసారి ఆయన్ని కలిసి క్షమాపణ అడగాలి. ఆయన క్షమించానంటే తప్ప నేను చేసిన పాపం నుండి నాకు విముక్తి కలగదు."

"ఆ పని మాత్రం చేయకండి. ఆయన మిమ్మల్ని ఎంతగా ప్రేమించారో సాగర్ అన్నయ్య చెప్పారు. మీరు చేసిన పని ఆయనకు మతిస్తిమితం తప్పేలా చేసింది. ఎంతో

కష్టంతో, సాగర్ అన్నయ్య కృషితో ఆయన మామూలు మనిషయ్యారు. నన్ను పెళ్ళి చేసుకున్నారు... ఇప్పుడు మీరు ఆయనకు కనిపించి మళ్ళీ ఆయనలో కల్లోలం రేపకండి!!"

"కానీ..."

"ఇంకేం చెప్పకండి. చేయని తప్పుకు ఆయన క్షోభ అనుభవించారు. చేసిన తప్పుకు మీరూ అనుభవించండి. రెండు లక్షల కోసం సలక్షణమైన భర్తను పోగొట్టుకున్నారు. బాధ్యత తెలియని ప్రియుడి కోసం బ్రతుకే మీకు అర్పించిన భర్తకు నరకం చూపారు. ఆడజాతి మొత్తం సిగ్గుతో తల దించుకునేలా ప్రవర్తించారు. ఇప్పుడు ఆయనకు కనిపించి చేసిన తప్పునే మళ్ళీ చేయకండి... వెళ్లండి!" అంది శ్రావణి.

అవమానంతో తల వంచుకుని వెళ్లిపోయింది విజయ.

"తను ఎందుకు అంత కఠినంగా మాట్లాడానా?' అని ఒక్కక్షణం బాధపడింది శ్రావణి! మళ్ళీ 'తను అంత కఠినంగా మాట్లాడకపోయివుంటే ఆమె తప్పకుండా సతీష్‌ని కలిసివుండేది. ఆమెను మరచిపోయి ప్రశాంతంగా జీవిస్తున్న అతనిలో కల్లోలం సృష్టించి ఉండేది. అది అతని సంగీత సాధననూ, కచ్చేరీలనూ కూడా దెబ్బతీసి ఉండేది. తను అలా మాట్లాడి మంచిపనే చేసింది!' - అనుకుంది శ్రావణి.

●

'ఆంధ్రభూమి' నిర్వహించిన 'ఉగాది కథల పోటీ'లో ఎంపికై,
'ఆంధ్రభూమి' దినపత్రిక 'ఆదివారం అనుబంధం' ... 17 సెప్టెంబర్' 2006 సంచికలో ప్రచురితమైంది.

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...
జయంతి పబ్లికేషన్స్
రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ।। 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.